సాక్షి
అనంతపురం

సోమవారం ၊ 30 ၊ అక్టోబర్ ၊ 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



సంతల ఆదాయం రూ.4.04 లక్షలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.04 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
36.4°/20.2°

జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తుంగభద్రలో తగ్గిన నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర డ్యాంలో నీరు తగ్గింది. ఆదివారం నాటికి 34.534 టీఎంసీల నీటి నిల్వ పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.427 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 0, అవుట్‌ఫ్లో 8,909 క్యూసెక్కులుగా నమోదైంది.

38 బైక్‌లు, 4 ఆటోలు సీజ్



అనంతపురంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: జిల్లా వ్యాప్తంగా 19 గ్రామాలు, ఏడు పట్టణ ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. డీఎస్పీల ఆధ్వర్యంలో పోలీసులు కర్ణాటక మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితులు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డి వామి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 38 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను సీజ్ చేశారు. ఆరుగురు అనుమానితుల వివరాలను లోతుగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు.

బహిరంగ మద్యపానంపై పోలీస్ దాడులు



లాడ్జీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: అక్రమ మద్యం నియంత్రణ – ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు దాడులు నిర్వహించారు. హోటళ్లు, ధాబాల్లో మద్యం విక్రయించడం, అనుమతించడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధం. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా ధాబాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం వినియోగానికి అనుమతి లేకుండా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. పార్కులు, శివారు ప్రదేశాల్లో మద్యం వినియోగించకుండా ప్రత్యేక నిఘా వేశారు. వీటితోపాటు కర్ణాటక మద్యం జిల్లాలోకి అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా తనిఖీలు, దాడులు చేశారు. వీటితో పాటు లాడ్జీల్లోనూ తనిఖీలు చేపట్టారు.

ప్రజలను భయాందోళనకు గురిచేయొద్దు



ఓబుళాపురం గ్రామస్తులతో సమావేశమైన ఫారెస్టు అధికారులు

బత్తలపల్లి: చిరుత సంచరిస్తోందంటూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌ఓ ఉసేనప్ప, ఎఫ్‌డీఓ అక్కులప్ప హెచ్చరించారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. కొందరు విద్యార్థులు నెట్‌లో నుంచి చిరుత ఫొటో డౌన్‌లోడ్ చేసినట్లు వివరించడంపై మండిపడ్డారు. కియా పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులు పలువురు తాము బైకులో వెలుతుండగా చిరుతను చూసినట్లు చెప్పారు. అది తమను కొంత దూరం వెంబడించినట్లు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కళ్లతో చూసినట్లయితేనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనవసరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, తప్పుడు ప్రచారం చేయడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, సంగాల, ఓబుళాపురం పంచాయతీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిరుతల సంచారం ఎక్కడా లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు.

ప్రైవేట్‌లో డెంగీ దందా





- అనంతపురంలోని కోవూరు నగర్‌కు చెందిన మనోహర్ మూడు రోజుల కిందట జ్వరంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అదే రోజు రాత్రికే అతనికి డెంగీ ఉందని వైద్యులు చెప్పారు. ఇప్పటి వరకు చికిత్స పేరిట అతని నుంచి రూ.45వేలు వసూలు చేశారు.
- శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెకు చెందిన కురుబ నాగరాజు జ్వరం, ఒళ్లు నొప్పులతో సాయినగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ప్లేట్‌లెట్స్ 10వేలకు పడిపోయాయని, ప్లేట్‌లెట్‌లు ఎక్కించాలంటూ ఇప్పటి వరకు అతని నుంచి రూ.50 వేలు వసూలు చేశారు.
- ధర్మవరానికి చెందిన చౌడప్ప తీవ్రమైన జ్వరంతో ఈ నెల 25న అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అతనికి డెంగీ పేరుతో వైద్యం చేశారు. చివరకు అతనికి వైరల్ ఫీవర్ అని తేలింది. అప్పటికే రూ.30 వేలు అతని నుంచి కట్టించుకున్నారు.

- రోగులను పిండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు
- ప్లేట్‌లెట్లు తగ్గాయంటూ భయపెడుతున్న వైద్యులు
- వైరల్ జ్వరమొచ్చినా ప్లేట్‌లెట్లు తగ్గే అవకాశముంది
- ఎన్‌ఎస్1 టెస్టుతోనే డెంగీ ఫీవర్‌గా నిర్ధారిస్తున్న వైనం
- ఎలీసా టెస్టు చేయకుండా నిర్ధారించకూడదన్న అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైరల్ జ్వరాలనూ డెంగీ ఖాతాలోకి వేసి ప్రైవేటు ఆస్పత్రులు భారీగా డబ్బు గుంజుతున్నాయి. రోగి రావడమే ఆలస్యం ప్లేట్‌లెట్లు పడిపోయాయన్న సాకుతో రకరకాల టెస్టులు, సెలైన్‌లు, ఇంజక్షన్‌లు ఇలా రకరకాల చికిత్సల పేరిట రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు లాగుతున్నాయి. అధికారికంగా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 145 డెంగీ కేసులు మాత్రమే నమోదై ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం డెంగీ కేసుల పేరుతో వేలల్లో వసూలు చేస్తున్నట్టు అధికారుల దృష్టికి వచ్చింది. జ్వరమొచ్చిన వారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు..

కొన్నేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వం డెంగీని నోటిఫైడ్ డిసీజ్‌గా పేర్కొంది. అంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడ కేసు నమోదైనా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. కానీ ఇలాంటివేమీ ఇవ్వకుండా డెంగీ పేరుతో వైద్యం చేసి డబ్బు గుంజుతున్నట్టు సమాచారం ఉండటంతో కలెక్టర్ ఆదేశాలతో 32 ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు. ఎన్ని డెంగీ కేసులకు చికిత్స చేశారు, డెంగీ కేసులైతే ఎందుకు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదు అని నోటీసుల్లో ప్రశ్నించారు. నోటీసులకు సమాధానం రాని ఆస్పత్రులను సీజ్ చేసే అధికారమూ ప్రభుత్వాని ఉంటుంది.

ఎన్‌ఎస్1 టెస్టుతో నిర్ధారించలేం..

ప్రైవేటు ఆస్పత్రులు ఎన్‌ఎస్ 1 (డెంగీ నాన్ స్ట్రక్చరల్ ప్రొటీన్1) పేరుతో డెంగీని నిర్ధారిస్తున్నాయి. ఆస్పత్రులన్నీ ఈటెస్టు ద్వారానే నిర్ధారించి చికిత్స చేస్తున్నాయి. కానీ డెంగీ జ్వరాన్ని ఎలీసా టెస్టు ద్వారా మాత్రమే నిర్ధారిస్తారు. వాస్తవానికి ఎలాంటి వైరల్ ఫీవర్ వచ్చినా ప్లేట్‌లెట్లు తగ్గడం సహజం. కానీ దాన్ని డెంగీ కింద చిత్రీకరించి రోగులనుంచి భారీగా వసూలు చేస్తున్నారు.

డెంగీ కేసుల వివరాలు..	
ఈ ఏడాది పరీక్షించిన శ్యాంపిళ్లు	7,040
డెంగీ పాజిటివ్ కేసులు	143
ఈ ఏడాది చేసిన మలేరియా శ్యాంపిళ్లు	2,27,326
నమోదైన పాజిటివ్ కేసులు	6

డెంగీ లక్షణాలు..

- ఈడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ జ్వరం వస్తుంది.
- దోమ కుట్టిన 24 గంటల్లోనే విపరీతమైన తలనొప్పి వస్తుంది.
- జ్వరం తీవ్రత పెరిగేకొద్దీ కళ్లు ఎర్రగా మారుతాయి.
- మరుసటి రోజు కండరాల నొప్పి తీవ్రమవుతుంది.
- అనంతరం కీళ్ల నొప్పులు వస్తాయి.
- ఒళ్లంతా దద్దుర్లలా మొదలై, ఎర్రగా మారతాయి.
- డెంగీ హీమరోజిక్ ఫీవర్ (డీహెచ్‌ఎఫ్) అంటే ఎక్కువ తీవ్రత ఉన్నట్టు.
- ఇక చివరి దశ అంటే డెంగీ షాక్ సింగ్రోమ్ (డీఎస్ఎస్) అంటారు.

సమాచారం ఇవ్వకపోతే చర్యలు

డెంగీ జ్వరాన్ని ఎలీసా టెస్టు ద్వారా మాత్రమే నిర్ధారిస్తాం. ఒకవేళ డెంగీ జ్వరం ఉందంటే ఆ పేషెంటు వివరాలు మాకు ఇవ్వాలి. ప్రైవేటు ఆస్పత్రులు వివరాలు ఇవ్వకుండా, ఇష్టారాజ్యంగా వైద్యం చేయడానికి లేదు. అందుకే ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చాం.

–డా.ఓబులు, జిల్లా మలేరియా అధికారి

'రత్నగిరి'లో గుప్త నిధుల వేట



గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన పురాతన గవి మఠం ప్రాంతం

రొళ్ల: శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలోని చారిత్రక రత్నగిరి దుర్గంపై గుప్త నిధుల వేట కొనసాగుతోంది. పురాతన గవి మఠం సమీపంలో ఇటీవల గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం పెద్దపెద్ద బండరాళ్లను పెకిలించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అటుగా వెళ్లిన కొందరు పర్యాటకులు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ప్రతి అమావాస్య, పౌర్ణమికి రెండు రోజులు ముందు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో శనివారం పౌర్ణమి కావడంతో అంతకంటే రెండు రోజుల ముందు గవి మఠం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రత్నగిరి దుర్గంపై నిఘా పెంచి గుప్తనిధుల వేటగాళ్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఉత్కంఠగా జూడో పోటీలు

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 67వ రాష్ట్ర స్థాయి జూడో అండర్ 14, 17, 19 బాల, బాలికల పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం పోటీలను హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రారంభించి, 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ బి.ఓబిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ బాబయ్య, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ముత్యాలు, చిత్రా వెంకి, ఆది, రమేష్ పాల్గొన్నారు.

జగనన్నతోనే వాల్మీకుల అభ్యున్నతి





కార్యక్రమానికి హాజరైన వాల్మీకులు, వాల్మీకి విగ్రహానికి అభిషేకం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు

- ఎస్టీ సాధనకు సీఎం సానుకూలం
- వాల్మీకి జయంతి సభలో మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వాల్మీకుల అభ్యున్నతి సాధ్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గంలో మంత్రి స్వగృహం వద్ద ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. మంత్రి వాల్మీకి సంఘం నాయకులు, మహిళలతో మమేకమై కలశాలతో ర్యాలీగా వెళ్లి వాల్మీకి సర్కిల్ వద్ద మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి అభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ వాల్మీకులే వైఎస్సార్‌సీపీ బలమన్నారు. జగనన్నతోనే వాల్మీకులకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందన్నారు. బోయ/వాల్మీకి కులానికి ఎస్టీ సాధనకు కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ శ్రీరాముడు లాంటి మహనీయుడి చరిత్రను మానవాళికి అందించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకులకు చట్టసభల్లో రాజకీయంగా మంచి గుర్తింపు ఇచ్చిన వ్యక్తి సీఎం జగనన్నారు. వాల్మీకులు వైఎస్సార్‌సీపీకి కట్టుబడి ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారన్నానుడి వాల్మీకి మహర్షితో సాధ్యమైందన్నారు. రామాయణం రచించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి మహర్షి వాల్మీకి అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తమకు పదవులు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర అన్నారు. కళ్యాణదుర్గంలో వాల్మీకులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం మంత్రి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు ములకనూరు గోవిందు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, జెడ్పీటీసీ సభ్యులు బొమ్మన్న, రాధాస్వామి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, నాయకులు తిరుమల వెంకటేశులు, బొమ్మయ్య, లక్ష్మన్న, హేమ, హనుమంతప్ప, దిలీప్, నరసింహులు, మీ సేవ కుమార్, ఓబిలేసు, బిక్కి హరి, చెన్నయ్య, అధిక సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు.

నా మాటలు వక్రీకరిస్తున్నారు

- రాజకీయ సమాధి అవుతారని చెప్పా
- జగన్ సీఎం అవడం చంద్రబాబు చూడాలి
- టీడీపీ నేతల తీరును తప్పు పట్టిన ఎంపీ మాధవ్



మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికీ కృషి చేశారని, వారంతా మరోమారు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడతారని, ఎన్నికల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ రాజకీయంగా సమాధి అవడం తథ్యమనే ఉద్దేశంతో సామాజిక సాధికార బస్సు యాత్రలో వ్యాఖ్యానించానని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పునరుద్ఘాటించారు. అయితే టీడీపీ నాయకులు తన మాటలను వక్రీకరించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ మాధవ్ విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు గురించి ఉచ్చారణ దోషంతో మాట్లాడితే దానిని పట్టుకుని టీడీపీ నానా యాగీ చేస్తోందన్నారు. నూరు గొడ్లను తిన్న రాబందు చిన్న గాలివానకు రాజమండ్రి సెంట్రల్ జైలులో పడిందని చంద్రబాబును ఉద్దేశించి ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనమనే తుపానుకు టీడీపీ, ఆ పార్టీ అధినేత ఏ విధంగా కొట్టుకుపోతారోనన్నారు. రాష్ట్రంలో నలుగురు బీసీలకు రాజ్యసభ సీట్లు కేటాయించి సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, ఎమ్మెల్యే, మంత్రి పదవుల్లో 60 నుంచి 70 శాతం బీసీలకు కేటాయించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేనని గుర్తు చేశారు. 139 బీసీ కులాలను ఒకే తాటిపైకి తెచ్చి అందులో వివిధ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న మేలును బీసీలు మరువరని తెలిపారు.

చంద్రబాబుకు పటిష్ట భద్రత..

చంద్రబాబుకు జైలులో పటిష్ట భద్రతను ప్రభుత్వం కల్పించిందని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. 2024లోనూ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టడం చంద్రబాబు చూడాలన్నదే తన ఆకాంక్ష న్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు చిత్రా వెంకటేశ్, నసనకోట ముత్యాలు పాల్గొన్నారు.

చింతలరాయ గోవిందా...గోవింద





పల్లకీలో విచ్చేస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత చింతల రాయుడు, రథోత్సవానికి హాజరైన భక్తజనం

తాడిపత్రి అర్బన్: చింతలరాయ గోవిందా.. గోవింద నామ స్మరణతో తాడిపత్రి ప్రాంతం ప్రతిధ్వనించింది. చింతల వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చింతల వేంకటరమణస్వామికి ప్రత్యేక పూజలు, చండీహోమం, రుద్రహోమం చేశారు. 9 గంటలకు రథశాల వద్ద రథాంగ పూజ, బలిహరణ, సాత్విక బలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు. సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథయాత్ర ప్రారంభమైంది. వివిధ రకాల నృత్య ప్రదర్శనల మధ్య భక్తులు రథాన్ని లాగారు. మెయిన్‌బజార్ గుండా బయలుదేరి హనుమాన్ జంక్షన్ వరకు రథం సాగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు రథశాలకు చేరుకుంది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ సీఎం గంగయ్య ఆధ్వర్యంలో సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎస్‌ఐలు మహ్మద్‌గౌస్, శ్రీనివాసులు, శరత్‌చంద్ర, గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

అవధుల్లేని ఆనందం



ఆనందంలో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీ సాయిబాబా నేషనల్ (ఎస్ఎస్‌బీఎన్) జూనియర్ కళాశాలలో 1969–71లో ఇంటర్ చదువుకున్న వారందరూ ఆదివారం అదే కళాశాల వేదికగా కలుసుకున్నారు. 52 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆ రోజుల్లో తాము చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన డాక్టర్ పి.రమేష్‌నారాయణ, డాక్టర్ పి.మురళీధర్, డాక్టర్ ఎల్‌కే విశ్వనాథయ్య, ఓఎస్ రామచంద్రయ్యను సన్మానించారు. కళాశాల అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కార్యదర్శి కె.నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రామ్మోహన్‌రావు హాజరయ్యారు. కళాశాలకు కార్పస్ ఫండ్‌గా రూ.లక్ష విరాళం అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రకటించారు. కార్యక్రమానికి ఏజీ వేణుగోపాల్ రెడ్డి, జి.నాగరాజు, బి.ఈశ్వర్‌రెడ్డి, కేతః ఉదయ్ కుమార్ నేతృత్వం వహించారు.

వేడి సాంబారులో పడిన చిన్నారి మృతి



మెర్సీ (ఫైల్)

కనగానపల్లి: ప్రమాదవశాత్తు వేడి సాంబారులో పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన చిన్నారి ఓడిపోయింది. వారం తర్వాత మృతి చెందింది. వివరాలు.. తగరకుంట గ్రామానికి చెందిన తప్పెట వెంకటేసులు, గౌతమి దంపతుల కుమార్తె మెర్సీ (3) ఓ విందు కార్యక్రమంలో వంటశాల వద్దకెళ్లి ప్రమాదవశాత్తు వేడి సాంబారు పాత్రలో పడింది. కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారిని వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం చిన్నారి మృతి చెందింది.

క్లుప్తంగా

అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు సంగాల విద్యార్థిని



జాతీయ స్థాయి పోటీల్లో విజేత ట్రోఫీని అందుకుంటున్న ఉమాదేవి (ఫైల్)

బత్తలపల్లి: ఆంధ్రప్రదేశ్ యువ రెజ్లర్ ఉమాదేవి అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. నవంబర్ 17న రష్యాలోని మాస్కోలో జరిగే ఈ మెగా టోర్నీలో జూనియర్ కేటగిరిలో 49కిలోల విభాగం నుంచి ఆమె తలపడనుంది. బత్తలపల్లి మండలం సంగాల గ్రామానికి చెందిన దేవరకొండ నారాయణస్వామి, సరస్వతి దంపతుల కుమార్తె ఉమాదేవి ప్రస్తుతం తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో ఏడాది చదువుతోంది. తండ్రి నారాయణస్వామి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంతర్జాతీయ పోటీలకు వెళ్లి వచ్చేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారు. దాతలు, క్రీడాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేస్తే దేశానికి మంచి పేరు తీసుకువస్తానని ఆమె ధీమా వ్యక్తం చేస్తోంది. ఎవరైనా దాతలు స్పందిస్తే ఫోన్ పే (7981894274, డి.నారాయణ స్వామి)కు లేదా ధర్మవరంలోని ఎస్‌బీఐ ఖాతా నంబర్ 32695973301 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0000250)కు నగదు బదిలీ చేసి సాయం చేయాలని ఆమె కోరుతోంది.

పట్టు పురుగులపై విషప్రయోగం



మృతి చెందిన పట్టుపురుగులు

రొద్దం: మండలంలోని ఆర్‌ఎల్ కొత్తూరులో పట్టుపురుగులపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగరాజు మల్బరీ సాగు చేపట్టారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మల్బరీ ఆకులపై క్రిమి సంహారక మందు పిచికారీ చేశారు. విషయం తెలియని నాగరాజు ఆ ఆకులను మేతగా వేయడంతో తిన్న పట్టుపురుగులు మృతి చెందాయి. ఘటనతో రూ. లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

వైద్యారోగ్య 'మస్తు'!

- ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా పీహెచ్‌సీలు
- ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది నియామకం



ఇది గుమ్మఘట్ట మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల. ఒకప్పుడు అధ్వాన స్థితిలో ఉన్న ఈ పీహెచ్‌సీ నేడు ఇదిగో ఇలా కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో అత్యాధునికంగా రూపుదిద్దుకుంది. 14 మంది వైద్య సిబ్బందిని నియమించారు. టీడీపీ హయాంలో వారమంతా కలిపినా ఆస్పత్రి ఓపీ రోగుల సంఖ్య 60 కూడా దాటేది కాదు. ప్రస్తుతం రోజూ ఓపీ నిమిత్తం వచ్చే రోగులే దాదాపు 120 మంది దాకా ఉంటున్నారు. ఇక్కడే కాదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి.

జిల్లాలో పీహెచ్‌సీలు	45
అర్బన్ ఏరియాలో ఆస్పత్రులు	25
నియమించిన మొత్తం సిబ్బంది	980

రాయదుర్గం: టీడీపీ హయాంలో ప్రాథమిక వైద్యశాలలన్నీ అధ్వానంగా ఉండేవి. రోగులకు కనీసం తాగునీరు అందుబాటులో ఉండేది కాదు. దీంతో గ్రామీణులకు దగ్గొచ్చినా, జలుబొచ్చినా, జ్వరమొచ్చినా పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులే దిక్కయ్యేవి. అయితే, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక ఆ పరిస్థితులన్నీ కనుమరుగైపోయాయి.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం..

పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. నాడు–నేడు పథకం ద్వారా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణుల చెంతకే నాణ్యమైన వైద్యం తీసుకెళ్లారు.

ప్రతి ఆస్పత్రిలో 14 మంది..

గతంలో ఒక్కో పీహెచ్‌సీలో ఒక్కో విధంగా సిబ్బంది ఉండేవారు. దీంతో రోగులకు సేవలు నామమాత్రంగానే అందేవి. ఉన్నవారితోనే సర్దుబాటు చేసి పంపేవారు. మందులిచ్చే వారే సూది మందు ఇవ్వాల్సి వచ్చేది. అటెండర్లే కట్లు కట్టాల్సిన దుస్థితి. ఇంకొన్ని చోట్ల ఫీల్డ్ స్టాఫ్‌ను వాడుకోవాల్సిన పరిస్థితి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీల్లో 14 మంది సిబ్బంది ఉండేలా నిర్ణయించి, ఆ మేరకు ఇటీవల 143 జీఓ తీసుకొచ్చింది. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు ఒకరు, సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్ ఒకరు, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ సూపర్‌వైజర్లు ఇద్దరు, (పురుషుడు, మహిళ), సీహెచ్‌ఓ లేదా ఎంపీహెచ్‌ఈఓల్లో ఒకరు, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌ఎన్, ఎఫ్‌ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఎల్‌జీఎస్) ఇలా 14 మంది ఉండేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 45 పీహెచ్‌సీలతో పాటు 25 అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆ మేరకు సిబ్బంది నియామక ప్రక్రియ అధికారులు పూర్తిచేశారు. 980 మంది సిబ్బంది అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాటు ప్రతి పీహెచ్‌సీలోనూ డిజిటల్ సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. 14 మంది ఉద్యోగుల వివరాలను కేడర్‌తో సహా పేర్లు పొందుపరిచారు.

సంతోషంలో పేదలు



నాడు–నేడు ద్వారా ఆస్పత్రులన్నీ సుందరంగా రూపొందాయి. జిల్లాలోని 45 ప్రాథమిక, 25 అర్బన్ హెల్త్ సెంటర్లలో 14 మంది సిబ్బంది నియామకం ప్రక్రియ పూర్తిచేశాం. వారి వివరాలను స్పష్టంగా తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయించాం. దీంతో వైద్య సేవలు గతంతో పోల్చితే చాలా మెరుగయ్యాయి. ఓపీ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సంస్కరణలపై పేదలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ఈబీ దేవీ, డీఎంహెచ్‌ఓ

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య



మృతురాలు ఐశ్వర్య

గార్లదిన్నె: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన రాము కుమార్తె ఐశ్వర్య (18)కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం పాపినేపాళ్యంలో బంధువుల ఇంటికి చేరుకున్న ఆమె... ఆదివారం ఉదయం కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

- కుటుంబ కలహాల నేపథ్యంలో గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లికి చెందిన వివాహిత యల్లమ్మ (37) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు చేసిన అప్పులు తీర్చడం ఆమెకు పెనుభారమైంది. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనకు లోనైన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.
- గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన లోలూరు రమేష్ (45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మతి స్థిమితం సరిగా లేని ఆయన శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వలంటీర్ బలవన్మరణం



రాజేష్ (ఫైల్)

రామగిరి: మండల కేంద్రానికి చెందిన వలంటీర్ గొల్ల రాజేష్ (29) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపిన మేరకు... కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన రాజేష్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయంగా గతంలోనూ ఆత్మహత్యాయత్నం చేశాడు. దాదాపు రూ.5 లక్షల వరకూ రాజేష్‌కు అప్పులున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య హరిత, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

పెనుకొండ: గోరంట్లకు చెందిన పాత్రికేయుడు ఈశ్వర్‌పై దాడికి పాల్పడిన కేసులో ధర్మవరానికి చెందిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. వివరాలను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ధర్మవరానికి చెందిన సింగెటి రాజు, నీలూరి రమేష్, చక్రవర్తి, కంసాల శంకరాచారి స్నేహితులు. వీరికి హత్యలు, దొంగతనాలు, పలు ఘర్షణలతో సంబంధం ఉంది. వీరి స్నేహితుడు శీన ధర్మవరానికి చెందిన శివకు రూ.లక్ష అప్పుగా ఇచ్చాడు. ఈ డబ్బు చెల్లించడంలో శివ వాయిదాలు వేస్తూ వచ్చాడు. ఒత్తిళ్లు పెరగడంతో శివ స్నేహితుడు ఐటీడీపీ నరేష్ జోక్యం చేసుకుని శీనతో మాట్లాడాడు. శివ వద్ద డబ్బు లేదని, ఉన్నప్పుడు ఇస్తాడని, అప్పటి వరకూ ఇబ్బంది పెట్టరాదని కోరాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో డబ్బు ఇచ్చేది లేదని, చేతనైనది చేసుకోమంటూ నరేష్ తిరగబడ్డాడు. దీంతో శివ డబ్బు ఇవ్వకుండా నరేష్ అడ్డు పడుతున్నట్లుగా శీన అపోహ పెంచుకున్నాడు. ఇదే విషయాన్ని నేర ప్రవృత్తి గల తన స్నేహితుల వద్ద చెప్పుకుని బాధపడ్డాడు. అయితే ఆరు నెలల క్రితం క్రికెట్ బెట్టింగ్ విషయంగా నరేష్‌కు సింగెటి రాజు, నీలూరి రమేష్, చక్రవర్తి, కంసాల శంకరాచారి మధ్య పాత గొడవలున్నాయి. ఇదే అవకాశంగా భావించిన వారు నరేష్‌పై దాడి చేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న నరేష్ సమీప బంధువు గోరంట్లకు చెందిన విలేకరి ఈశ్వర్... చక్రవర్తికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. దమ్ముంటే గోరంట్లకు వచ్చి తనను కొట్టాలని సవాల్ విసిరాడు. దీంతో రెచ్చిపోయిన చక్రవర్తి బృందం ఈ నెల 26న గోరంట్లకు చేరుకుని ఈశ్వర్‌పై కట్టెలతో దాడి చేసి పారిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ఈ నెల 28వ తేదీ సాయంత్రం పెనుకొండలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తచ్చాడుతున్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అయితే ఈ కేసులో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని, కేవలం వ్యక్తిగత కక్షతోనే దాడి జరిగినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసిందని డీఎస్పీ హుస్సేన్‌పీరా వెల్లడించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు సుబ్బరాయుడు, రాజారమేష్, సిబ్బందిని అభినందించారు.

పోలీసుల త్యాగాలు వృథా కావు



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, పోలీసు అధికారులు

అనంతపురం క్రైం: పోలీసుల త్యాగాలు వృథా కావని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ అన్బురాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను తృణ ప్రాయంగా త్యజించిన అమరవీరులను స్మరించుకోవడం పౌరులుగా అందరి బాధ్యత అని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కరరెడ్డి, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతోనే ప్రాంతాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

అనంతపురం రూరల్: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరమని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలు అంశంపై ఆదివారం అనంతపురం శివారులోని రేడియంట్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు చేరువైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విభజన అనంతరం రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం చివరకు మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాల అభివృద్ధికి రూ.లక్ష కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్; సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాస్ట్రో కిరణ్ కుమార్, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

యాడికి: వివాహితను కిడ్నాప్ చేసిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపిన మేరకు... యాడికి మండలం పిన్నేపల్లె గ్రామానికి చెందిన ఓ వివాహితను మాయమాటలతో లోబర్చుకున్న అదే గ్రామానికి చెందిన సతీష్... ఈ నెల 26న ఆమెను తన వెంట పిలుచుకెళ్లాడు. ఇదే విషయంపై వివాహిత భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు తిరుపతిలో ఉన్న ఆమె ఆచూకీని పసిగట్టి పిలుచుకొచ్చారు. విచారణ అనంతరం వివాహిత ఫిర్యాదు మేరకు సతీష్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం వేములపాడు క్రాస్‌లో సంచరిస్తున్న సతీష్‌ను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తాడిపత్రి: రెండు రోజుల క్రితం గొంతు కోసుకున్న వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రెండు రోజుల క్రితం గొంతుకు తీవ్రమైన గాయంతో బాధపడుతున్న తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌లో లింగుట్ల లక్ష్మీదేవి (60)ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. మాట్లాడలేని స్థితిలో బాధితురాలికి ప్రథమ చికిత్స అందజేసి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆమె మృతి చెందింది. అయితే ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ హమీద్ ఖాన్ తెలిపారు. అయినా మృతురాలు తానే గొంతుకోసుకుందా, లేక ఇతరులు ఎవరైనా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు వివరించారు.

లారీని ఢీకొన్న కారు – ఒకరి మృతి



రమేష్ (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన బోయ రమేష్(28) తన మిత్రులు క్రిష్టిపాడు మోహన్, భీమునిపల్లికి చెందిన ఈశ్వరరెడ్డితో కలసి ఆదివారం రాయల చెరువుకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని రాత్రి స్వగ్రామానికి కారులో ప్రయాణమయ్యారు. గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్, ఈశ్వరరెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఘటనపై ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

గోడ కూలి వ్యక్తి మృతి



ఓబులేసు (ఫైల్)

కూడేరు: గోడ కూలి మీద పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన కురుబ ఓబులేసు(65) ఆదివారం సాయంత్రం తన పశువుల పాకలో ఆవును కట్టేస్తుండగా గోడ కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ఆయనను కుటుంబసభ్యులు వెలికి తీసి అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

● పాతికేళ్ల అనుబంధం



పాతికేళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుంతకల్లు: ఒకే స్కూల్‌లో చదువుకున్న వారంతా పాతికేళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. వివరాలు.. గుంతకల్లులోని రైల్వే హైస్కూల్‌లో 1998లో పదో తరగతి చదువుకున్న వారందరూ ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడ్డారు. దసరా సెలవుల నేపథ్యంలో కుటుంబాలతో సొంతూళ్లకు వచ్చిన వారందరూ ఆదివారం ఉదయం రైల్వే హైస్కూల్‌లో కలుసుకున్నారు. తరగతి గదుల్లో బెంచీపై కూర్చొని నాడు తాము చేసిన అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ మధుసూదన్‌తో కలసి కేక్ కట్ చేసి, సందడి చేశారు. పాత గుత్తి రోడ్డులోని అరక్షిత శిశు మందిరంలో అనాథలకు అన్నదానం చేసి కాసేపు సరదాగా గడిపారు.

పట్టేద్దామా ప్రోత్సాహకం

- సివిల్స్ పరీక్షలో రాణించేలా ప్రభుత్వ బాసట
- బడుగు, బలహీన వర్గాల అభ్యర్థుల కోసం బృహత్తర పథకం
- ప్రిలిమినరీలో అర్హత సాధిస్తే రూ.లక్ష
- మెయిన్స్ పాసైతే రూ.50 వేల ప్రోత్సాహం

ప్రశాంతి నిలయం: సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులు యూపీఎస్సీ పరీక్షలో రాణించేలా 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పేరుతో ప్రభుత్వం బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాల సాధికారితకు పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి... తాజాగా ఆయా వర్గాల్లో బాగా చదివే వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అమలు ఇలా...

ఏటా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు రాష్ట్రం నుంచి 40 నుంచి 50 మంది వరకూ సత్తా చాటుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఆ సంఖ్యను మరింత పెంచేలా 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పథకానికి రూపకల్పన చేసింది. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధిస్తే రూ.50 వేల ప్రోత్సాహకం అందించనుంది. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాకే నగదు జమ కానుంది. ఈ ఏడాదిలో జరిగిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు http://jnanabhumi.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఎన్ని దఫాలుగానైనా ఈ ప్రోత్సాహకాన్ని పొందవచ్చు.

అర్హతలు ఇలా..

- దరఖాస్తుదారు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత నివాసం ఉండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షలు మించకూడదు.
- కుటుంబంలో ఉద్యోగి ఉన్నట్లయితే వారి ఆదాయ ధృవపత్రం ఉండాలి.
- 10 ఎకరాల మాగాణి లేదా 25 ఎకరాల మెట్ట భూమి లేదా మెట్ట, మాగాణి రెండూ కలిపి 25 ఎకరాల్లోపు ఉండాలి.

క్లుప్తంగా

అధైర్య ...పడొద్దు అండగా ఉంటాం



యల్లప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: అధైర్య పడకండి...మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల వైస్ ఎంపీపీ–2 మన్నల వరలక్ష్మి మామ, వైఎస్సార్ సీపీ నాయకుడు మన్నల రవికుమార్ తండ్రి మన్నల యల్లప్ప నారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రామినేపల్లికి చేరుకుని యల్లప్ప మృతదేహానికి పూలమలలు వేసి నివాళులర్పించి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. యల్లప్ప కుటుంబ సభ్యులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాప్తాడు నియోజకవర్గ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిడదూరి గోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైస్ ఎంపీపీ రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

నేడు స్పందన

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10: 30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. వివిధ డివిజన్లలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేసేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు విద్యా రుణాలు



విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఆవోపా నాయకులు

అనంతపురం కల్చరల్: అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. స్థానిక రాజురోడ్డులోని అవోపా కార్యాలయంలో నిర్వాహకులు చంద్రమోహనగుప్తా, జయంతి శ్రీనివాసులుశెట్టి, శ్రీరాం సుధాకర్, పాలమడ రమేష్ తదితరులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదేవత వాసవీమాత ఆశీస్సులతో విద్యాభివృద్ధి కోసం 37 మందికి రూ.52 వేలు విలువ చేసే ప్రతిభా పురస్కారాలు, మరి కొందరికి రూ. 3 లక్షల విద్యారుణాలు అందించామన్నారు. అంతకు ముందు వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్: కావలి సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ బత్తుల రాంసింగ్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడాన్ని ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు ఖండించారు. ఆదివారం అన్ని ఉద్యోగ సంఘాల నాయకుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతపురం ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందుతులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సోమశేఖర్, ఖాజా మొహిద్దీన్, ఈయూ నాయకులు పీఎస్ ఖాన్, రామకృష్ణ, నాగరాజరెడ్డి, ఎన్ఎంయూ నాయకులు సూరిబాబు, డీఎన్ రెడ్డి, కొండయ్య, రామకృష్ణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు ఆకస్మిక మృతి



చంద్ర (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య కార్మికుడు చంద్ర (43) ఆకస్మికంగా మృతి చెందాడు. నగరపాలక సంస్థ అధికారులు తెలిపిన మేరకు.. పారిశుధ్య కార్మికుడు (రెగ్యులర్) కంపోస్ట్ యార్డులో గేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయినగర్ రెండో క్రాస్‌లో ఓ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స తీసుకొని బయటకు వస్తుండగా ఉన్న ఫళంగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

• గౌరమ్మా.. చల్లంగ చూడమ్మా!

అమ్మలగన్న అమ్మ..గౌరమ్మ తల్లీ.. చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నగరంలోని రుద్రంపేటలో ఆదివారం ఉదయం చిన్నా పెద్దా తేడాలేకుండా ఇంటిల్లిపాదీ నూతన దుస్తులు ధరించి, గౌరమ్మ పండుగను వైభవంగా జరుపుకున్నారు. మహిళలతో పాటు బాలికలు కూడా చీర కట్టుతో ఆకట్టుకున్నారు. గౌరమ్మ ప్రతిమను ఎత్తుకుని గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు కోలాటం ఆడి సందడి చేయగా, యువత బాణాసంచా పేల్చి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో తులతూగేలా దీవించాలని గౌరమ్మ పండుగను ఏటా నిర్వహించుకోవడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



గౌరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు,బాలికలు



సంప్రదాయ వస్త్రధారణతో కోలాటం ఆడుతున్న బాలికలు



బాణా సంచా పేలుస్తున్న గ్రామస్తులు



చీరకట్టులో చిన్నారులు

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లిలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా గౌరమ్మ పండుగను జరుపుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం గౌరమ్మకు పట్టుచీర, గాజులు, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.గౌరమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గౌరమ్మదేవిని వీధుల్లో డప్పు, వాయిద్యాలతో ఊరేగించి, చెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో గౌరమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని రాడ్స్ సంస్థ అధ్యక్షుడు బండ్లపల్లి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై రాడ్స్ సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేతో చర్చించారు. పాడి రైతుల సంక్షేమం కోసం రాడ్స్ సంస్థ చేస్తున్న వివిధ కార్యక్రమాలపై వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పాటు నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ఏర్పాటు ద్వారా మహిళా రైతులు పొందుతున్న ఉపాధిపై ఎమ్మెల్యేకు వారు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో రాడ్స్ సంస్థ సలహాదారు తలమర్ల సంజీవరెడ్డి, సభ్యులు భక్త భూషణ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసిన రాడ్స్ సంస్థ ప్రతినిధులు

నిత్య చైతన్యశీలి కలేకూరి ప్రసాద్

అనంతపురం కల్చరల్: కలేకూరి ప్రసాద్ నిత్య చైతన్యశీలిగా సమాజాన్ని నడిపించి ఆదర్శప్రాయుడిగా నిలిచిపోయాడని వక్తలు అన్నారు. ప్రముఖ ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహితీవేత్త, సినీ గేయ రచయిత కలేకూరి ప్రసాద్ సాహితీ సదస్సు నిర్వహించారు. జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నే ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహుజన తత్వవేత్త కత్తి కల్యాణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతినారాయణ, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ తదితరులు మాట్లాడారు. కలేకూరి సాహిత్యం అజరామరమని అన్నారు. కలేకూరి రాసిన పాటలు, వ్యాసాలు ఎంతో మందిని చైతన్యమార్గంలో నడిపించాయని కొనియాడారు. అట్టడుగువర్గాల వారి జీవనాన్ని, ఈతి బాధలను ఆయన పలికించిన తీరు అద్భుతమన్నారు. గోసల నారాయణ స్వామి ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కవులు, రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, విద్యావతి, పద్యకవి ఏలూరు యంగన్న, నర్సిరెడ్డి, రియాజుద్దీన్, హరినాథరెడ్డి, వెంకటరమణ, నబీరసూల్, వన్నప్ప, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కత్తి కల్యాణ్‌ను సత్కరిస్తున్న అనంత సాహితీవేత్తలు



ఆత్మకూరు పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కనగానపల్లి (ఆత్మకూరు): ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా తమ బాల్య స్నేహితులతో కలిసి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దీంతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల ఏర్పాటు

• నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు



సాయినగర్ మూడో క్రాస్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ ఏర్పాటు చేసిన దృశ్యం



సాయినగర్ ఒకటో క్రాస్‌లో సెల్లార్, కాలువపై ఏర్పాటు చేసిన ర్యాంపు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సాయినగర్, సంగమేశ్‌సర్కిల్, రాంనగర్, రాజురోడ్డు, సుభాష్ రోడ్డు, కమలానగర్, తదితర ప్రాంతాల్లో సెల్లారకు స్వర్గధామంగా మారింది. నగరంలో కొందరు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపడుతున్నా, టౌన్ ప్లానింగ్, పట్టణ ప్రణాళిక కార్యదర్శులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా సెల్లార్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకున్నా సెల్లార్లను ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యతో పాటు ఏమైనా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు. కాలువలపై నిర్మాణాలు చేపడుతున్నా కనీసం అధికారులు అటువైపు తొంగిచూడడం లేదు. సాయినగర్ మూడో క్రాస్‌లో నిబంధనలకు విరుద్ధంగా రెండు భవనాలు నిర్మిస్తున్నారు. ఓ భవన నిర్మాణదారుడు ఏకంగా సెల్లార్లలో వ్యాపారాలు చేసేలా ప్రత్యేక గదులు ఏర్పాటు చేసేలా నిర్మాణం చేపట్టాడు. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళిక కార్యదర్శి మెమో కూడా ఇవ్వలేదు. అదేవిధంగా సాయినగర్ మొదటి క్రాస్‌లోనూ కాలువపై నిర్మాణం చేపట్టారు. రాజురోడ్డులోనూ కాలువపై నిర్మాణం చేపట్టారు. ఇలా కాలువలను సైతం ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు, పట్టణ ప్రణాళిక కార్యదర్శులు పట్టించుకోలేదు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

అనంతపురం: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రీడా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. తపోవనం ప్రీమియర్ లీగ్ –2023 సీజన్ –2 ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ హాజరయ్యారు. అండర్–12 ఫైనల్స్‌లో ఏఎస్పీటీంపై తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. అపెక్స్ కన్‌స్ట్రక్షన్ ఎండీ తిరుపాల్ విజేతలకు రూ.11,111, రన్నర్స్‌కు రూ.2,222 ప్రైజ్ మనీ అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ మధు ఆచారి, ఏసీఏ కోచ్ నరేష్ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండించాలి

అనంతపురం అర్బన్: గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గపు యుద్ధాన్ని యావత్ ప్రజానీకం ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న అన్నారు. ఆదివారం సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ర్యాలీని స్థానిక కృష్ణకళామందిర్ నుంచి టవర్‌క్లాక్ వరకు నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పెద్దన్న మాట్లాడుతూ 106 ఏళ్లగా పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమి రక్షణ కోసం, తమ అస్తిత్వం కోసం పోరాటం సాగిస్తోందన్నారు. అమెరికా అండతో గాజాపై ఇజ్రాయిల్ అత్యంత కిరాతకంగా చేస్తున్న యుద్ధాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్, రామాంజనేయులు, బాలు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి, నాయకురాలు రాజమ్మ, రాధ, సరళ, తదితరులు పాల్గొన్నారు.



పాలస్తీనాకు సంఘీభావ ర్యాలీ చేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

విదేశాల్లోనూ అనంత నృత్యకళా వైభవం



విదేశాల్లో నాట్యప్రదర్శనతో ప్రశంసలందుకున్న కళాకెరటాలు



అంతర్జాతీయ వేదికపై నాట్యప్రదర్శనకు సిద్ధమవుతున్న సంధ్యామూర్తి శిష్యబృందం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే శాస్త్రీయ నృత్యరీతులను అనంత నృత్య కళా నిలయం కళాకారులు దేశవిదేశాల్లోనూ పరిచయం చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో అనేక విదేశీ వేదికలపై సంప్రదాయ నృత్యంతో అలరించారు. ఈసారి జర్మనీలో జరిగే కళా ప్రదర్శనకు అనంత తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ విదేశీ ప్రముఖుల సమక్షంలో అనంత కళాకారులు సంప్రదాయ కూచిపూడి నాట్య ప్రదర్శనతో అలరించనున్నారు.

జర్మనీలో భారతీయ సంప్రదాయం :
ఏటా నవంబరు మాసంలో దివాళీ ఫెస్ట్ పేరిట ఇండో– జర్మన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను చాటేందుకు దేశంలోని ప్రఖ్యాత కళాకారుల శాస్త్రీయ సంగీత, నాట్యాలను అక్కడి వారికి పరిచయం చేస్తారు. ఈసారి శ్రీనృత్య కళానిలయం సంధ్యామూర్తితో పాటు ఆమె శిష్యులు మహాలక్ష్మి, హిమజ, భవ్యశ్రీ, శ్రీధరి జర్మనీ దేశంలోని స్టుటెన్సీ నగరంలో ఈనెల 4న కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు. స్త్రీ శక్తి కళారూపాన్ని అక్కడ ప్రదర్శించనున్నట్లు నాట్యాచార్యులు సంధ్యామూర్తి తెలిపారు.

దశాబ్దాల కిందటే అనంత రెపరెపలు :
పారిస్ నగరంలో నృత్యకళానిలయం తరఫున 1992లోనే నెలరోజుల పాటు అనురాధ బృందం నాట్యప్రదర్శలు ఇచ్చి మెప్పించింది. అలాగే 2013లో దుబాయ్, 2014లో సింగపూర్, 2015లో థాయ్‌లాండ్, 2019లో మలేషియా దేశాల్లో అనంత శాస్త్రీయ నృత్య కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి మాట్లాడుతూ దశాబ్దాలుగా నృత్య కళానిలయం చిన్నారులకు దేశ విదేశీ వేదికలపై నర్తించేందుకు సిద్ధం కావాలని నిర్దేశిస్తున్నట్లు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నీరుగంటి వీధి, రెండో రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పాతూరు సీడీ ఆస్పత్రి, లక్ష్మీనగర్ భరతమాత స్కూల్‌లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజమ్మకాలనీ, లక్ష్మీనగర్ సచివాలయ ప్రాంతాల్లోని ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక

బుక్కరాయసముద్రం: జాతీయ స్థాయి జూడో పోటీలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్ తేజ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా చిగిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో అండర్–14 విభాగం జూడో పోటీలలో బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్ తేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని హెచ్‌ఎం, సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి అంజన్న, అనంతపురం జిల్లా జూడో అసోసియేషన్ సీఈఓ బాబు టోర్నీ ఆర్గనైజర్ ప్రతాప్‌రెడ్డి, పీడీ లలితమ్మ అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కనగానపల్లి (ఆత్మకూరు): ఆత్మకూరు మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భక్తులు పంచామృతాభిషేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి ఆకుపూజ, నైవేద్యపూజ, పల్లకీ సేవ, మహా మంగళారతి పూజలు చేశారు. వీటితో పాటు కుజదోషం, కాలసర్పదోష నివారణకు సుబ్రమణ్యస్వామికి మూలమంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు ఈ పూజలలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఈఓ అక్కిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు గంధం ఉత్సవం

అనంతపురం కల్చరల్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బీబీ ఖాసీంబీ ఖాదిరి సాహెబా 16వ గంధం ఉత్సవం, కోర్కెలు తీర్చే రొట్టెల పండుగ సోమవారం జరగనుంది. ఈ మేరకు మహదేవ్‌నగర్‌లోని దర్గా కమిటీ నిర్వాహకులు సద్గురువు షేక్ సయ్యద్ మహ్మద్ వలీషా ఖాదిరీ తెలిపారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని రాత్రి హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులతో ఖవ్వాలీ అనంతరం, అన్నదానం జరుగుతాయని తెలిపారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు



అలరించిన నటీనటుల అభినయం

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఏపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులను ఆదరించడానికి నిర్వహిస్తున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రాత్రి కక్కలపల్లి గ్రామంలో ఆణిముత్యాలు పేరిట చింతామణి, సుభద్రరాయబారం, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం , సత్యహరిశ్చంద్ర వారణాశి సీను నాటకాలు ప్రదర్శించారు. నిర్వాహకులు మైఖేల్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలను నాటికలు, నాటకాల ద్వారా కళాకారుల ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. వీధుల్లోని రోడ్లపై ఎక్కడా చెత్తకనిపించకూడదన్నారు. ఆదివారం నగరంలోని రాంనగర్, అరవిందనగర్, సుభాష్‌రోడ్డు, రాజు రోడ్డు తదితర ప్రాంతాల్లో అదనపు కమిషనర్ పర్యటించారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు, కార్మికులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. నగర ప్రజలు చెత్తను కాలువల్లో వేయకుండా నగరపాలక సంస్థ కార్మికుల చేతికి అందించాలని కోరారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



అన్నదానం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆరో రోడ్డులో ఆదివారం రాత్రి ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని, అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, సైపుల్లా బేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాధాకృష్ణ, షెక్షావలి, శివ, జాని, అయూబ్, అంజి, షేక్షావలి, దాస్ తదితరులు పాల్గొన్నారు.